**రైతు కొడుకు రైతు! ఎన్నో యేళ్ళు శ్రమించి అలసిపోయిన ముసలి రైతు పోతే కొత్త రైతు వస్తాడు? అయితే, బ్రతుకూ?**

తొలికోడి కూసింది. అలవాటుప్రకారం వెంకయ్యకు మెలకువ వచ్చింది. ఇంత నిద్రపట్టదు! దశాబ్దాలుగా రక్తంలో జీర్ణించిపోయిన అలవాటాయెమరి! తొలికోడి కూయగానే లేవటం, గొడ్లదగ్గర పనీపాటూ పూర్తిచేయటం, పొలానికి బయలుదేరటం.

బయట పొగమంచు కురుస్తోంది. మంచు తెరలోంచి యిళ్ళూ, చెట్లూ అన్నీ సమాధుల్లా కన్పిస్తున్నాయి. చలిగాలి మెల్లగా వీస్తోంది. కన్పించని కత్తికోతలా చలి శరీరాల్ని బాధిస్తోంది. చలికి భయపడి రక్తం చర్మాన్ని వదలి వెచ్చదనం కోసం శరీరపు లోలోపలి భాగాలకు పారిపోతున్నది.

"దీనెమ్మ! ఈ ఏడు చలి మరీ మోపుగా వుంది" అనుకున్నాడు వెంకయ్య. చలి మోపుగా వుందా? లేక తన వొంట్లో శక్తి లేక చలి మోపుగా వున్నట్లన్పిస్తోందా? ఏమో!

ఎద్లు లేచిన సవ్వడి విన్పిస్తోంది. ఎద్ల ముందు మేత అయిపోయి వుంటుంది అనుకున్నాడు. చలికి బిగదీసుకుపోయిన కీళ్ళు సవరించుకుంటూ మెల్లగా లేచి తలగుడ్డతీసి చెవుల్లోకి గాలిపోకుండా గట్టిగా బిగించి చుట్టాడు. చలికి వణుక్కుంటూనే లేచివెళ్ళి వామిలోంచి కొంచెం వరిగడ్డి దూసుకొచ్చి ఎడ్ల ముందు వేశాడు. అలాగే నాలుగు వరకలుతెచ్చి గేదెముందువేశాడు. అవి మెదలు సారించి మెల్లగా గడ్డితినటం ప్రారంభించినై.

వెంకయ్య తిరిగివచ్చి మంచంమీద కూర్చున్నాడు. రాత్రి సగంకాల్చి ఆర్పి, వక్కన దాచిన చుట్టతీసి నోట్లోపెట్టుకుని వెలిగించాడు. నాలుగుసార్లు చుట్టపొగ పీల్చి వదిలేసరికి వొంట్లో కొంచెం వెచ్చగా అన్పించింది

"రేపు షావుకారు దగ్గర నుంచి వొడ్ల మిగ్గిన తాలూకు డబ్బుతెచ్చి నారాయణయ్యగారి దగ్గర చేసిన అప్పు తీర్చెయ్యాలి. అప్పు తీర్చేస్తే.... ఆలోచనలో వడ్డాడు వెంకయ్య. "ఇంకా సంకురాత్రి పండుగ వదిహేను రోజులుంది. ఈ అప్పు తీర్చేస్తే ఇంకా పదో, పాతికో డబ్బు మిగలొచ్చు. తనకు ఊహ తెలిసినాక అప్పులేని సంకురాత్రి ఇదే మొదటిది. అప్పులేని పండుగ" ఎండిపోయిన పెదవుల మీదకు చిరునవ్వొచ్చింది వెంకయ్యకు.


"పుట్టి బుద్దెరిగినాక ఎన్ని సంకురాత్రులు గడిచినయ్యి! ఇప్పుడు తనకెన్నేళ్ళో! అరవై దెబ్బై ఏళ్ళుండవూ? యిన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు చావు దగ్గరికొచ్చినాక మొట్టమొదటసారిగా అప్పులేని పెద్ద పండగ చూడబోతున్నాడు తాను

ఈ అప్పు తీరిపోతే ఇంక తాను చచ్చిపోయినా ఫర్వాలేదు. అసలు చచ్చిపోవటమే మంచిది. చచ్చిపోతేనే తాను అదృష్టవంతుడు. కాదా మరి! తనతోటివాళ్ళు చాలామంది యిప్పటికే చచ్చిపోయారు జబ్బులొచ్చీ, ముసలివాళ్ళయ్యీ! కాని అందరూ కొడుకులకు ఆస్తిపంచినా, లేకున్నా అప్పులు వంచిపెట్టిపోయిన వాళ్ళే. తాను మాత్రం కొడుక్కు అప్పు మిగల్చకుండా పోతాడు. ఇది అదృష్టం కాదా? తన యెరికలో తోటివాళ్ళలో కొడుకులకు అప్పులు మిగల్చకుండా పోయినవాళ్ళు లేరు. తానే మొదటివాడు."

తనకు తండ్రి మిగిల్చిపోయింది ఎకరం పొలంతోపాటు, వెయ్యిరూపాయల అప్పు. బహుశా తాతకూడా తన తండ్రికి అప్పు మిగిల్చే పోయివుంటాడు- తనకు తెలీదు.


తండ్రి మిగిల్చిపోయిన అప్పు తీర్చటానికి ఎంత కష్టపడ్డాడు తను! కండలు కరిగాయి. రక్తం మరిగి చెమటగా బయటకొచ్చి ఆవిరైంది. ఆవిరి గడ్డకట్టి పైసలయాయి. పైసలు రూపాయలుగా అప్పు కింద, వడ్డీ కింద వెళ్ళిపోయేవి. అప్పు తీరుతూందని సంతోషపడేలోగా మళ్ళీ ఏదో అవసరానికి అప్పు చేయాల్సివచ్చేది!

తన తండ్రి మిగిల్చిపోయిన అప్పు తీర్చడానికే తనకు నాలుగేళ్ళు పట్టింది. ఇంక ఈ సంవత్సరం పంటలో అప్పు తీరుతూందనుకునే లోగా ఆ సంవత్సరం గాలి వాన వచ్చింది. ఎట్లాంటి గాలివాన అది. ఎంతెంత పెద్ద చెట్లూ వేళ్ళతోసహా లేచిపోయాయి. ఊళ్ళో పెద్దవాళ్ళ డాబాలు తప్పించి మిగతా పూరిళ్ళన్నీ పడిపోయాయి. కోతకొచ్చిన పంట పొలాల్లో మొలబంటి నీళ్ళు నిలిచాయి. పైర్లు పడిపోయి కంకులు బుర



# కొత్త రైతు

## సుంకర సాంబిరెడ్డి



దలో కూరుకుపోయాయి. చేతికి రాబో తున్న పంట వరదపాలైంది. ఇల్లు పడి పోయింది. ఇల్లు చూసి, పొలం చూసి ఎంత దుఃఖించాడు తను. ఎంత దుఃఖపడి ఏం లాభం.

షావుకారు ధగ్గరకు వెళ్ళటం, ఎడం చేతి బొటనవేలికి కాటుక రాసుకుని నోటు మీద వేలు ముద్ర వెయ్యటం, డబ్బు తెచ్చుకోవటం తప్పలేదు. పడిపోయిన మట్టిగోడలు సరిచేసి, రెండు తాడిచెట్లు కొని, నరుక్కొచ్చి రెండు విట్టాళ్ళ పాక వేశాడు. ఒక వసారాలో ఎడ్లూ, గేదె వుండటానికి వీలుగా వేశాడు.

అంతా నష్టపోయినా షావుకార్లు మాత్రం లాభమే తీశారా సంవత్సరం కూడా! మట్టి గొట్టుకుపోయిన వడ్లు వాళ్ళు కిష్టమొచ్చిన ధరకు కొన్నారు. ఆ డబ్బైనా వెంటనే యిచ్చారా? అదీ లేదు. ఆ వడ్లు మరపట్టించి, బియ్యం అమ్ముకుని వాళ్ళలాభాలు వాళ్ళు దాచుకున్నాక అడగ్గా అడగ్గా ఎప్పటికో చెప్పినరేటులో ఇంకా తగ్గించి యిస్తారు. వడ్లల్లో మట్టీ.దుమ్మూ వస్తాయని 'తారం' కింద, కన్యకాపరమేశ్వరి ధర్మంకింద నూటికి రూపాయి తగ్గిస్తారు. తమ డబ్బు వాళ్ళు ధర్మంచేయడం ఏమిటో!

ఆ అప్పు తీరడానికో నాలుగేళ్ళు. ఈలోగా ఎడ్లు ముసలివయిపోయాయి. బండి పాతైపోయింది. ఎడ్లూ, బండీ లేకుండా నడవదు గదా బతుకు. అవి వుంటేనే దొరికినంత వరకూ ఏదో ఒకటి బాడిగ తోలుతూంటేనే ఏదో సంసారం గడుస్తుంది!

అయినకాడికి ఎడ్లూ, బండీ తెగనమ్మాడు. మరికొంత అప్పు చేశాడు. మరో జత ఎడ్లు కొంచెం వయసులో వున్నవి కొన్నాడు. కొత్తబండి చేయించే స్తోమత లేదు తనకు. మళ్ళీ పాత బండే కాస్త గట్టిగా వున్నది చూసి కొన్నాడు. ఏదో దేముడు చల్లగా చూసి వానలూ, ఎండలూ సరిగ్గా వుండి పంటలు పండితే నాలుగైదేళ్ళలో అప్పు తీరకపోతుందా?

ఆ తర్వాత నాలుగైదేళ్ళు పంటలు బాగానే పండాయి గాలివానలూ, తెగుళ్ళూ తక్కువే. కాని వడ్లకు ధరేదీ! అదేమిటో మాయ. పంట పండిన సంవత్సరం ధర వుండదు ధర పెరిగినా వడ్లు తమ దగ్గిరున్నంతకాలం పెరగదు. వూళ్ళో వడ్లన్నీ షావుకార్ల దగ్గర కెళ్ళగానే వడ్లకు ధర పెరిగిందంటారు. దసరా వరకూ అమ్మకుండా అట్టిపెడితే ధర పెరుగుతుందిగాని అప్పటిదాకా ఆగేదెట్లా? సంవత్సరం మొత్తానికి ఒకసారి వాడా స్తాయి తర్వాతొక యిరవో, తూముడో మినుములో, పెసలో రెండో పంట పండు తుంది. అవి తినటానికి. మళ్ళీ సంవత్సరం విత్తనాలకీ సరిపోతాయి. ఇంక ఆ వడ్లమ్ముకుంటే వాచ్చేదాంతోనే సంవత్సరమంతా జరుపుకోవాలి. పంట కళ్ళంలో వుండగానే శిస్తు కట్టాలి. అప్పిచ్చినవాళ్ళు అప్పు తీర్చమని అడగటం మొదలుపెడతారు. ఇంక పంట యింటి కొచ్చి దసరావాకా దాచే దెక్కడ– రేటు పెరిగే దెక్కడ! అయినకాడికి కళ్ళంలోనే తెగనమ్మాలి. అప్పులు తీర్చాలి! ఎండలో వానలో చలిలో సంవత్సరం పొడుగునా బురదలో, ధూళిలో కష్టించి పండించిన బంగారం కళ్ళముందు అలా మెరిసి ఇలా వెళ్ళిపోతుంది!

ఎడ్లూ, బండికొన్న అప్పు తీరబో తూండగా– ఊరు మొత్తం తగలబడి పోయింది– అక్కడక్కడ కొద్దిపాటి యిళ్ళు తప్పించి! నిప్పు ఎలా అంటుకుందో ఏమిటో ఎవరికీ తెలీదు. కన్ను మూసి తెరిచేలోగా ఊరంతటికీ పాకింది. మండుతున్న యిళ్ళలోంచి వీలయిన సామాన్లు చేతబుచ్చుకుని ఊరిబయటకు పరుగెత్తారంతా. ఆ మంటల్లోనే తన పాడిగేదె కాలి చచ్చిపోయింది.

కాలిపోయిన మొండిగోడలు, సగం కాలి చచ్చిపడివున్న గేదె - ఎన్నో సంవత్సరాల నాటి దృశ్యం అంతా కళ్ళకు కట్టినట్లుగా వుంది వెంకయ్యకు. ఆ రోజు ఎడ్లనూ, గేదెనూ పొలం తోలుకు వెళ్ళాడు తను- యింకా పాలు వదలని గేదెదూడను మాత్రం ఇంటి దగ్గర వదలి పొలంలో వాటిని మేపుకుని యింటికి తిరిగి వస్తున్నాడు. ఊరు దగ్గరకు వచ్చేసరికి మండు

తున్న ఇళ్ళు కన్పించాయి. ఎడ్లనూ, గేదెనూ ఊరి బయటే వదిలి యింటి వేపు పరుగెత్తాడు తను. తనూ, భార్యా కలిసి యిల్లు తగలబడుతుంటే దూడనూ, వీలయిన సామాన్లనూ తీసుకుని బయటకు వచ్చారు.

ఎడ్లు ఊరి బయటే వుండిపోయాయి కాని గేదె మాత్రం పరుగెత్తుకుంటూవచ్చి తన దూడ యింకా ఇంట్లోనే వుందన్న భ్రమతో మండుతున్న యింట్లోకి దూరి కాలి చచ్చిపోయింది. ఆ గందరగోళంలో తను చూసుకోలేదు.

ఇల్లు కట్టుకునేందుకూ, గేదెలు కొనుక్కునేందుకూ మళ్ళీ అప్పు-ఎప్పుడూ తన ఎడమచేతి బొటనవేలికి కాటుక తడి ఆరటమేలేదు.

తర్వాత మూడేళ్ళపాటు సరిగ్గా వర్షాలు లేవు. పంటలు అంతంత మాత్రం—మనుషులకు తిండిలేదు. పశువులకు గడ్డిలేదు. కొందరు ఊరొదిలిపోయారు. తన లాంటి మొండివాళ్ళు మాత్రం ఊరు వదల్లేదు వీలయిన వస్తువులన్నీ అమ్ముకుంటూ, అప్పులు చేస్తూ, వర్షంకోసం ఆకాశంవంక చూస్తూ, వస్తులుంటూ, దేముడిని తల్చుకుంటూ, ఏడుస్తూ, ఏడవలేక నవ్వుకుంటూ !

కరువు ఆఖరు సంవత్సరంలో ఆ వేసవి కాలం మొత్తం తెల్లవారుతూనే బండికట్టేవాడు తను. ఊరికి దూరంగా వున్న అడవికి పోయేవాడు. అడివంటే అందులోనూ పెద్ద చెట్లుండేవి కావు ముళ్ళతుప్పలూ, బొమ్మజెముడు పొదలూ ఎక్కువ. అక్కడ తాడిచెట్లన్నీ వెదికి తాటికాయలన్నీ కొట్టుకొచ్చేవాడు, గొడ్లు తినటానికి వీలయిన ప్రతి చెట్టు ఆకునూ దూసుకొచ్చేవాడు. ఇంటికి వచ్చినాక ఆ కాయలన్నీ చెక్కలు చెక్కలుగా తరిగి గంపలో పోసి మేపి తనఎడ్లనూ, గేదెనూ బ్రతికించుకున్నాడు అట్లా కరువు గడిచి బతికి బయటపడ్డాడు.

ఇటువంటి పెద్ద కష్టాలకు తోడు పుట్టుకలు, పెళ్ళిళ్ళు, చావులు, రోగాలు, రొష్టులు ఎప్పుడూ వుంటాయి. దేనికైనా డబ్బు కావాలి. డబ్బు కావాలంటే అప్పు చెయ్యాలి. అప్పు తీర్చాలంటే....

వానదేవుడు కరుణించి సమయంలో వానలు కురిసి చెరువులు నిండించాలి. తమ పొలాలు పండాలి. అప్పుడు తమ కడుపుకింత తిండి దొరుకుతుంది, పశువులకు మేత దొరుకుతుంది. ఇంతాచేసి పైరు కోత కొచ్చేలోగా గాలివానలు రాకూడదు. తెగుళ్ల రారాదు. మిడతలదండ్లు దాడిచేయరాదు. ధాన్యానికి ధరవుండాలి. అప్పులు తీరాలి— తమకు మిగలాలి, అప్పుడుకదా తమకు తిండి తినబుద్ధయ్యేది-తిన్న తిండి వొంటబట్టేది.

"కాలవొస్తుందంట. కాలవొస్తే వానల మీదా, చెరువులమీదా ఆధారపడకుండా కాలవలో నీళ్ళొస్తాయంట. పాతికేళ్ళాయి యిదే మాట వింటున్నాడు తాను ఇంకెన్నాళ్ళు పడుతుందో కాలవ రావటానికి—బహుశా తను చూడలేడు. తాను బ్రతికుండగారాదు. తన తరంవాళ్ళెవరూ చూడలేరు."

కొంచెం చలిమంట వేసుకుంటే బాగుండునన్పించింది వెంకయ్యకు. మెల్లిగాలేచి కొద్దిగా గడ్డితెచ్చి దూరంగా వేసి కూర్చున్నాడు. ఒక గుప్పెడు గడ్డి తీసి అగ్గిపుల్లగీసి వెలిగించాడు. గడ్డి మెల్లగా కాలుతూంటె వెచ్చగా వుంది. మంటలోకి చూస్తూ మళ్ళీ ఆలోచనల్లోకి జారుకున్నాడు.

"గడ్డి లేకపోతే లోకం నడుస్తుందా. గడ్డి గొడ్లు తింటాయి. గింజలు మనుషులు తింటారు గడ్డి యిళ్ళ మీద వేసుకుంటే ఎండకూ, వానకూ నీడనిస్తుంది. చలి మంట వేసుకుంటే వేడినిస్తుంది. మెలిపెట్టి ఎంట్లు పడితే ఏనుగును కూడా కట్టెయ్యొచ్చునంట।"

మంట ఆరిపోతూంటె మళ్ళీ గుప్పెడు గడ్డి వేశాడు. మంట మళ్ళీ లేచింది. మంటలోకి చూస్తుంటే మళ్ళీ తమ జీవితాలు గుర్తొచ్చాయి వెంకయ్యకు.

"తన తరంలో అందరి బ్రతుకులూ ఇలానే వున్నాయి. తమ బ్రతుకుల్నిలా ఆడిస్తున్న సూత్రం ఏమిటి?

ఊహ తెలిసినప్పటినుంచి శ్రమించటంతప్ప మరోటి తెలీదు. తింటే అది ఆకలి తీర్చుకోడానికితప్ప రుచులకోసం కాదు. బట్ట కడితే మానం కాపాడుకోవటానికితప్ప షోకులకోసంకాదు. ఎండకూ, వానకూ చావకుండా మాత్రమే యిల్లు.

కష్టపడటం తెలుసు. అప్పు చేయకుండా వుండలేకపోవటం తెలుసు. తరగని అప్పును తీర్చటానికి ప్రయత్నించటం తెలుసు.

పెళ్ళాం కనబోతున్నది- కొడుకు పుట్టబోతున్నాడు. ఖర్చులకు డబ్బుకావాలి. డబ్బున్నవాడిదగ్గరకు పో. ఎడంచెయ్యి బొటనవేలికి కాటుకరాయి- నోటు మీద ముద్దరెయ్యి.

కొడుక్కిజబ్బుచేసింది. మందిప్పించాలి గవర్నమెంటు ఆస్పత్రికి పో. అక్కడ మందులుండవు ఆ డాక్టర్ చూడడు. అయితే అప్పు తీసుకురా, మంచి డాక్టరు దగ్గరకు వెళదాం.


చేలో ఎరువు చిమ్మాలి. చీకట్లో పోతున్నావు తేళ్ళూ, పాములూ వుంటాయి జాగ్రత్త.

చేను దున్నాలి- సొంతఎడ్లూ, నాగలీ వున్నాయిగా ఫర్వాలేదు-డబ్బవసరంలేదు. అరక లేని వాళ్ళకంటే మనం నయమే.

ఈ సంవత్సరం దేముడిదయబాగుంది. వానలు సమయానికి కురిశాయి ఈ సంవత్సరం పొడుగునా యిట్లాగే సమయానికి వానలు కురిస్తే బాగుండును। అంతా దేముడి దయ వానల్లు కురవాలి వానదేముడా ! వరిచేలు పండాలి వానదేముడా !

నారుమడి పొయ్యాలి. విత్తనాలు యింట్లోవే- భయంలేదు.

నాట్లు వెయ్యాలి, డబ్బు కావాలి- అప్పు చెయ్య



కలుపులు తీయాలి. మొగుడూ, పెళ్ళాం ఇద్దరూ కష్టపడి ఎలాగో పూర్తి చెయ్యవచ్చు బయటినుంచి కూలికి పిలవనక్కరలేదు

వానలు లేవు. పైరు ఎండిపోయేట్లుంది పొలాలు నెమ్మదిగా నెర్రెలు విచ్చుతున్నాయి. ఏం చేద్దాం? మనమేం చేయగలం? అంతా ఆ దేముడి దయ దేముడి దయుంటే వాన వస్తుంది

పైరుకు తెగుళ్ళు పడ్డాయి మందులు చల్లితేగాని పంట దక్కదు. ఎకరానికి ఎన్ని రూపాయలవుతాయో! డబ్బులేదు అప్పుచేస్తావా? పంట నాశనమౌతుంటే చూస్తూ ఊరుకుంటావా? ఏంచేద్దా?

ఇదేం గాలివానరా భగవంతుడా! ఇంకో పది రోజులాగితే పంట చేతికొచ్చునే. ఇప్పుడు గాలి వానొస్తే ఇంత పంటా నాశనమే- పైరుపడిపోయి, కంకులు బురదలో కూరుకుపోయి, గింజలు నిలువు మీదే మొలకెత్తకుంటా వుంటాయా? వున్నా కోయటానికి వీలవుతుందా? కోసి, కుప్ప వేసి, నూర్చినా ఆ మట్టిగొట్టుకున్న ధాన్యం ఎవరు కొంటారు? ఏం ధర వుంటుంది?

కోతలకు, కుప్పలు వేయటానికి, నూర్చటానికి అన్నింటికీ డబ్బు కావాలి— అప్పు చెయ్యాలి.

ఇంతాచేసి యింటికొచ్చిన ధాన్యానికి ఎంత ధర వొస్తుంది. అంతా షావుకార్ల దయ. వొచ్చిన డబ్బులు అప్పులు తీర్చటానికి చాలవు.

కూతురు పెళ్ళికెదిగింది. పెళ్ళిచేస్తావా? చెయ్యవా?

ప్చ! శలవు లేదు. పండగ లేదు. సంవత్సరంలో మూడువందల అరవై అయిదు రోజులూ ఎండలో, వానలో, చలిలో మట్టి పిసికి చెమటోడ్చి పండించింది అప్పులు తీర్చటానికిచాలదు. ఎందుకు చేశావు అప్పు- షోకులకుకాదు సారాయి తాగటానికికాదు, ముండలకు ఖర్చుపెట్టటానికి కాదు. పలావులు తినటానికి కాదు. ఎందుకు? ఎందుకు?

ఎందుకేమిటి? పంట పండించటానికే. కాని ఏం పండిస్తాడు తాను. పంటలు పండాలంటే వానలుకురవాలి నీళ్ళుకావాలి. అది తన చేతిలో లేదు. పోనీ వానలెక్కువై చేలు నీళ్ళలో మునిగిపోతే—మునక్కుండా చెయ్యగలడా? లేదు. పోనీ మురుగు నీళ్ళు తొందరగా చేలోంచి పోయేట్లు చేయగలడా? లేదు. తెగుళ్ళు రాకుండా చేయగలడా? వస్తే మందులు కొట్టించగలడా? లేదు. మిడతలదండును ఆపగలడా? లేదు. గాలి వానలు రాకుండా చేయగలడా? లేదు. పోనీ వస్తే తట్టుకోగలడా? లేదు. కోసి కుప్ప వేసినాక దొంగలొచ్చి దోచుకోకుండా చూడగలడా? కాపలా పడుకోగలడు. దొంగలొచ్చి చావబాది దోచుకుపోతే ఏం చెయ్యగలడు?.... దొంగల్ని తరవాతైనా పట్టుకోగలడా? లేదు. పోనీ, పంటకు ఎంత రేటు వస్తుందో చెప్పగలడా? లేదు. పోనీ చీకట్లో పొలం వెళ్తున్నప్పుడు ఏ పామో కరిచి చస్తే ఏమవుతుందో చెప్పగలడా? ఆ దినం చెయ్యటానికి ఖర్చుల కోసం కొడుకు అప్పుచేస్తాడు!"




మనిషి జీవనానికి
ఒక అర్ధాంగి
రెండు వలపు పంటలు
మూడు ముళ్ళ బంధం
మనిషి పతనానికి
ఒక గ్లాసు
రెండు అంకెలు
మూడు ముక్కలు.

— కాశీనాథ & కాశీనాథ

## 2

వెంకయ్యకు మెలకువ వచ్చింది. చుట్ట అందుకుందామని కుడిచెయ్యి చాపబోయాడు. చెయ్యి లేవలేదు. చెయ్యి లేపటానికి ప్రయత్నంచేస్తూ చేతివంకే చూసుకున్నాడు. ఎంత ప్రయత్నించినా చేయి లేవటంలేదు. లేచి మంచంమీద కూర్చుందామని ప్రయత్నించాడు. కుడికాలు స్వాధీనంలో లేదు! హఠాత్తుగా అర్థంకాని భయంతో గుండె జలదరించింది. ఏమైంది తనకు? కాలూ, చేయి కదిలించలేకపోతున్నాడేం తను? "రాముడూ" అని పెద్దగా కొడుకును కేక వేయబోయాడు. నోట్లోంచి కేక రాలేదు. అస్పష్టమైన చిన్నశబ్దం మాత్రం వచ్చింది.

కొంతసేపటికి రాముడు అటుగా వచ్చాడు. తండ్రి యింకా పడుకునే వుండడం అతడికి ఆశ్చర్యం కలిగించింది. దగ్గరగా వచ్చి "ఈరోజు యింకా పడుకున్నావేం నాన్నా?" అని పలకరించాడు. వెంకయ్య పలకలేదు. మాట్లాడుదామని ప్రయత్నించాడుగాని నోట్లోంచి మాట రాలేదు. రాముడు కంగారుపడ్డాడు. తండ్రిని కదిలించి చూశాడు. ఏం చేయాలో ఒకక్షణం అర్థంకాలేదు. పరుగెత్తుకెళ్ళి పొరుగింటి చంద్రయ్యను తీసుకువచ్చాడు. చంద్రయ్య వచ్చిచూసి "పక్షవాతం వచ్చినట్లుంది. వెంటనే వెళ్ళి డాక్టర్ని తీసుకురా" అన్నాడు. రాముడు పరుగెత్తాడు.

డాక్టరు వచ్చి పరీక్షించి పక్షవాతమేనని నిర్ధారించారు. చీటీ రాసి రాముడికిస్తూ "ఈ మందులన్నీ వాడుతూండు. మెల్లగా తగ్గుతుంది. పక్షవాతంగదా— నాలుగైదు రోజుల్లో తగ్గేది కాదు. ఖంగారు పడనవసరంలేదు." అని చెప్పి వెళ్ళిపోయాడు.

వెంకయ్య కళ్ళల్లో నీళ్ళొస్తున్నాయి. కొడుకుతో ఏదో చెబుదామని ప్రయత్నం చేస్తున్నాడు. కాని మాట రాదాయె. తాను చెప్పదలచుకున్నది చెప్పలేక మూగగా బాధపడుతున్నాడు. కళ్ళనీళ్ళు కారుస్తున్నాడు.

"నాయనా! రాముడూ నా పనైపోయింది. ఈ రోజో, రేపో రాలిపోబోతున్న పండిపోయిన ఆకును నేను. నన్నింకా బ్రతికించాలని ప్రయత్నించకు. అప్పు తీర్చగా మిగిలిన పదో, పరకో నాకోసం ఖర్చు చేయకు నాకోసం అప్పుచేయకు. నాకోసం అప్పు చేస్తావేమోనని ఏడుస్తున్నాను-ఛస్తానేమోనని భయంతోకాదు.

అప్పులో పుట్టాను. అప్పులో పెరిగాను. కనీసం అప్పు లేకుండా చావనీ నన్ను."

* * *

"పాపం! వెంకయ్య చచ్చిపోయాడంట"

"ఎంత మంచివాడు. కాలికి పట్టిన జలగను కూడా చంపేవాడు కాదు. తీసి దూరంగా యిసిరేసేవాడు."

"ఏ పనైనా ఎంత బాగా చేసేవాడు. పొలం పనులు తెలిసిన వాళ్ళలో వెంకయ్యనే ముందు చెప్పాలి."

"పాపం కొడుక్కి అప్పు లేకుండాచేసి పోవాలన్న వెంకయ్య ఆఖరికోరిక తీరనే లేదు. వెంకయ్య జబ్బుకూ, దినానికీ చివరికి అప్పే చెయ్యాల్సొచ్చింది."

* * *

నాగలిపూన్చి, ముల్లుగర్ర చేతబట్టుకుని ఎడ్లు నదిలించాడు రాముడు. తండ్రి పోయాక మొదటి సారిగా నాగలి కదుతున్నాడు రాముడు.

వేలిముద్ర వెయ్యటంకోసం కాటుక పూసిన రాముడు ఎడంచెయ్యి బొటనవ్రేలు నల్లగా మెరుస్తోంది! తెలుగు దేశంలో కొత్తరైతు పుట్టాడు! ★